

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 31-01-2026 | సంపుటి - 26 | సంచిక -252 | రూ : 4 | పేజీలు: 8


## రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..

### తొలి సీఎంగా చరిత్ర

- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో లీడర్ షిప్ కోర్సును పూర్తి చేసుకున్న రేవంత్
- సర్టిఫికెట్ అందించిన హార్వర్డ్ అధ్యాపకులు
- శిక్షణలో సాధారణ విద్యార్థిలా గడిపిన రేవంత్




2లో



## గద్దెలపై కొలువైన వనదేవతలు

2లో

- వెదురు కర్రలే దైవాలుగా... గద్దెలే గర్భగుడులుగా భక్తులకు దర్శనం
- కోట్లాది హృదయాలను ఏకం చేసిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర

## అసలు పని... ఇప్పుడే మొదలైంది

- కాకినాడ జేఎన్టీయూలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం
- అన్ని రంగాల్లో ఏపీని నెంబర్ వన్ గా నిలపడమే లక్ష్యమని స్పష్టీకరణ
- పాదయాత్ర అనుభవాలు ప్రభుత్వంలో అమలు చేస్తున్నామన్న యువనేత
- నైతిక విలువల కోసం చాగంటిని సలహాదారుగా నియమించామని వెల్లడి



2లో

### ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు...

## 14న బడ్జెట్!




2లో

- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- ఫిబ్రవరి 14న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- దాదాపు నాలుగు వారాల పాటు కొనసాగనున్న సమావేశాలు

## ఇది ఎక్సలెంట్ న్యూస్

- 'ఐగాట్ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో ఏపీ సరికొత్త రికార్డు
- కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఘనత
- ప్రభుత్వ ఉద్యోగుల నిబద్ధతను కొనియాడిన సీఎం చంద్రబాబు
- నైపుణ్యం గల పరిపాలన కోసమే ఈ కార్యక్రమమని వెల్లడి
- ఈ ఘనతలో ఏపీఎస్‌డీపీఎస్ పాత్రను అభినందించిన సీఎం




2లో



2లో


## పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి: సీఎం చంద్రబాబు

- గుంటూరు జీజీహెచ్‌లో మాతాశిశు కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4 కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ కోసం 'సంజీవని' ప్రాజెక్టుకు శ్రీకారం

### సిగాచి బాధితులకు పరిహారం..

## ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- సిగాచి ఫార్మా ప్రమాద బాధితుల పరిహారంపై హైకోర్టు అసహనం
- ప్రభుత్వం తీరుపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం




2లో

# గద్దెలపై కొలువైన వనదేవతలు



ములుగు: వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు-కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్క-రైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం —— మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత... మన దేవత... జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు.

*** భక్తులతో కిక్కిరిసిన జాతర ప్రాంగణం**

జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి.

*** భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రిస్తున్న అధికార యంత్రాంగం**

భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

*** వైద్య బృందాలు, వాలంటీర్లు అప్రమత్తం**

జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.

*** వన దేవతల సేవలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు**

మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు.





సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

**ప్రముఖుల దర్శనాలు...**

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ - నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి - తల్లులను దర్శించుకున్నారు
- మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ - అమ్మవార్లను దర్శించుకున్నారు .
- మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ శ్రీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ శ్రీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, శ్రీ పాయం వెంకటేశ్వర్లు, శ్రీ గండ్ర సత్యనారాయణ - అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

* బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు

**భక్తుల ప్రశంసల జల్లు**

ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు. భక్తి, నమ్మకం, సంప్రదాయం, సంస్కృతి సమ్మేళనంగా... ప్రభుత్వ సమర్థ నిర్వహణతో... సజావుగా సాగుతున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర.

# రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..
## తొలి సీఎంగా చరిత్ర

అమెరికా, జనవరి 30 : రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 25న ఈ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమయింది. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.

# ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు...
## 14న బడ్జెట్!

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.

# ఇది ఎక్సలెంట్ న్యూస్: సీఎం చంద్రబాబు

ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే 'ఐగాట్ కర్మయోగి' పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది అద్భుతమైన వార్త అని, ప్రభుత్వ ఉద్యోగులు నిరంతర అభ్యాసంపై చూపుతున్న నిబద్ధతకు ఈ ఘనత నిదర్శనమని ఆయన అన్నారు. నైపుణ్యం, చురుకుదనం, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా పరిపాలనను నిర్మించడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఐగాట్ కర్మయోగి ప్లాట్‌ఫామ్‌పై కోటికి పైగా కోర్సు ఎన్‌రోల్‌మెంట్లు, 80 లక్షలకు పైగా కోర్సుల పూర్తితో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఉద్యోగులు మొత్తం 4,290 కోర్సులలో ఈ శిక్షణ పూర్తిచేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థను (APSDPS) సీఎం ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఆంధ్రప్రదేశ్ సాధించిన ఈ ఘనతను ప్రశంసించింది. ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పౌర సేవలపై సానుకూల ప్రభావం చూపడంలో రాష్ట్రం ముందుందని కొనియాడింది. ఏపీ సాధించిన ఈ విజయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంది. ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు ఇది నిలువుటద్దమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# కేరళలో పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించిన టీమిండియా సభ్యులు

కేరళ, జనవరి 30 : న్యూజిలాండ్‌తో జరగనున్న చివరి టీ20 మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టు సభ్యులు దైవదర్శనం చేసుకున్నారు. తిరువనంతపురంలోని చారిత్రక శ్రీ పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జరగనున్న సిరీస్‌లోని ఆఖరి మ్యాచ్‌కు ముందు వారు స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, బ్యాటర్ రింకు సింగ్, స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి వెళ్లారు. ఈ సిరీస్ ఆరంభం నుంచి భారత ఆటగాళ్లు తరచూ ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన నాలుగో మ్యాచ్‌కు ముందు సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్‌ను భారత్ ఇప్పటికే 31 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, బుధవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 50 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

# పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి

అమరావతి: ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గడ్డను మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన 'కానూరి జింఖానా' మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్మాణం కోసం గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు ఏకంగా రూ.100 కోట్లు విరాళంగా సమకూర్చగా, ప్రభుత్వం పరికరాలు, ఫర్నిచర్ కోసం మరో రూ.27 కోట్లు వెచ్చించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు కేటాయించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. సమాజంలో ఇంకా మంచితనం మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా దశాబ్దాల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు జన్మభూమిని మరచిపోతారు. కానీ మీరు చదువుకున్న కళాశాలను గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేయడం అభినందనీయం. భవన నిర్మాణంతో పాటు, భవిష్యత్తులో దాని నిర్వహణకు ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం మీ ముందుచూపునకు నిదర్శనం" అని ప్రశంసించారు.

**పేదల అభ్యున్నతికే 'పీ4'**

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించే లక్ష్యంతోనే తాను 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై గెలుపు) కార్యక్రమాన్ని తీసుకొచ్చానని ముఖ్యమంత్రి వివరించారు. "కేంద్ర ప్రభుత్వం రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కోసం పీ4 మోడల్‌ను ప్రోత్సహిస్తోంది. కానీ నేను పేదల అభ్యున్నతి కోసం పీ4ను అమలు చేస్తున్నాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గుతాయి. చదువు అనేది ఒక గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఆర్థిక సాయంతోనే ఉన్నత స్థాయికి చేరారు. పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10.42 లక్షల మందిని లక్షా 2 వేల మంది దాతలు దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

*** అమరావతిపై దార్శనికత.. అభివృద్ధిపై ధీమా**

రానున్న పదేళ్లలో గుంటూరు, అమరావతి ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు రానుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలన్నది నా లక్ష్యం. ఒకప్పుడు సైబరాబాద్ నిర్మించాం, ఇప్పుడు అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ'కి శ్రీకారం చుడుతున్నాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో ముందుకు వెళుతున్నాం" అని అన్నారు. 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామని, నేడు దేశం విద్యుత్ రంగంలో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

**ఆరోగ్య సేవల్లో 'సంజీవని' విప్లవం**

టెక్నాలజీని ఉపయోగించి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. "ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలందరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టు పూర్తయింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తాం. 2026 నాటికి 72 లక్షల మంది రోగుల డేటాను సేకరించి, రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. త్వరలో ఎయిర్ అంబులెన్సులు, 2026 నాటికి డ్రోన్ అంబులెన్సులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు.

# పవన్ తో అనుబంధం, కాలేజీ రోజుల గురించి...

అమరావతి: కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన 'హలో లోకేశ్' కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. వివిధ విభాగాలకు చెందిన 20 మంది విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. పవన్ కల్యాణ్‌తో తనకున్న అనుబంధం, తన చదువు, ఇంటర్న్‌షిప్ అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి అవకాశాలపై కీలక హామీలు ఇచ్చారు. గోదావరి పుష్కరాలు, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా రంగం అభివృద్ధిపై ప్రభుత్వ ప్రణాళికలను వివరించారు. వ్యక్తిగత జీవితం నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు అనేక అంశాలపై విద్యార్థులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. జేఎన్‌టీయూ ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థిని ప్రాప్తి ఈ కార్యక్రమానికి యాంకర్ గా వ్యవహరించారు.

**విద్యార్థుల ప్రశ్నలు – మంత్రి లోకేశ్ సమాధానాలు**

**శ్రావ్య, సివిల్ ఇంజనీరింగ్ ఫైనలియర్**

**గోదావరికి ఏటా వచ్చే వరదల సహాయ చర్యల్లో విద్యార్థులుగా మేము ఏం చేయగలం? గోదావరిపై మీ ఆలోచనలు ఏమిటి?**

నారా లోకేశ్: ఉభయగోదావరి జిల్లాలు రాష్ట్రానికి ధాన్యాగారాలని, ఆక్వాలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. స్థిరమైన అభివృద్ధి అవసరమని, డిజిటల్ ట్విన్స్ వంటి టెక్నాలజీతో వరదలను ముందుగా పసిగట్టే ప్రయత్నం చేయాలి. ట్రంప్ టారిఫ్ నేపథ్యంలో ఆక్వాకు కొత్త మార్కెట్లు అన్వేషిస్తున్నాం. సమాజంలోని వాస్తవ సమస్యలను పరిష్కరించే దిశగా విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి.

**యువరాజ్, బిటెక్, 2వ సంవత్సరం**

**మీరు ఇంజనీరింగ్‌లో రికార్డులు, అసైన్‌మెంట్లు మీరే రాశారా? మీ వైవా ఎలా జరిగింది?**

నారా లోకేశ్: నేను యూఎస్‌లోని కార్నెగీ మెల్లన్ కళాశాలలో చదివాను, అక్కడ ఇతరులతో రాయించే విధానం లేదు (నవ్వుతూ). నేను బట్టీ పట్టే రకం కాదు, క్రిటికల్ ఎనలిటికల్ థింకింగ్‌పై దృష్టి పెట్టాను. విద్యామంత్రిగా కూడా అదే విధానంలో ఆలోచిస్తున్నా. వేరొకరి పేపర్ చూసి రాయాలనే ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు. కృత్రిమ మేధ (AI) మిమ్మల్ని మెరుగుపరుస్తుంది కానీ, దానిపై పూర్తిగా ఆధారపడొద్దు.

**ఐశ్వర్య, 3వ సంవత్సరం మెకానికల్ ఇంజనీరింగ్**

యూపీలో కుంభమేళాకు మీరు వెళ్లారు కదా, అక్కడ ఎలా నిర్వహించారు? రాబోయే గోదావరి పుష్కరాలు ఎలా చేయబోతున్నారు?

నారా లోకేశ్: కోట్లాది మంది హాజరయ్యే కార్యక్రమాల్లో క్రౌడ్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యం. కుంభమేళాలో అక్కడి ప్రభుత్వం ఘాట్లను డిజిటల్ ట్విన్‌తో అనుసంధానించి అద్భుతంగా నిర్వహించింది. గతంలో రాజమండ్రి పుష్కరాల్లో జరిగిన దుర్ఘటన పునరావృతం కాకుండా, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కోసం ఇప్పటి నుంచే పనులు ప్రారంభించాం. క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం డిజిటల్ ట్విన్ ప్రాజెక్టును సిద్ధం చేయాలని జేఎన్‌టీయూ యాజమాన్యాన్ని కోరుతున్నాం.

**సాయిప్రకాష్, బి.టెక్ 3వ సంవత్సరం**

**నేను పిఠాపురం వాడిని. మీరు, పవన్ కల్యాణ్ గారు సొంత అన్నదమ్ముల్లా కలిసిపోతారు. మీరిద్దరూ మొదటిసారి ఎప్పుడు కలుసుకున్నారు? మీ మధ్య బంధం ఎలాంటిది?**

నారా లోకేశ్: 2014 ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి పవన్ కల్యాణ్ గారిని కలిశాను. చంద్రబాబు గారిని రిమాండ్‌లో పెట్టినప్పుడు, పవనన్న వచ్చి మా కుటుంబానికి అండగా నిలిచిన విధానం జీవితాంతం గుర్తుంటుంది. కష్టకాలంలో మన వెంట ఎవరు నిలబడతారో వారే నిజమైన మిత్రులు. యువత అటువంటి వారిని ఎప్పటికీ మర్చిపోకూడదు. మా అనుబంధం అలాంటిది.

# సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరిహారం పంపిణీలో జాప్యం, స్పష్టత లేకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గతేడాది సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో 56 మంది దుర్మరణం చెందగా, 8 మంది ఆచూకీ లభ్యం కాలేదు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ బాధితులకు పరిహారం అందించాలని, ఘటనపై సిట్ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. "పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు? ఎంత ఇస్తున్నారు? అసలు ఎప్పుడు ఇస్తారు?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పరిహారం పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కంపెనీని, ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ కేసులో ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలిని సుమోటోగా ప్రతివాదులుగా చేర్చింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు చట్టప్రకారం అందాల్సిన ప్రయోజనాల వివరాలను సమర్పించాలని వారికి నోటీసులు జారీ చేసింది.

## జగద్గిరిగుట్టలో
# జాతి పిత కు ఘన నివాళి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని చివరి బస్ స్టాప్ లోని గాంధీ విగ్రహానికి జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు కొడుకుల జైహింద్, బి ఆర్ ఎస్ నాయకులు పాపిరెడ్డి, పాపులు గౌడ్, మెట్ల శ్రీను,నాని, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు స్వయం ఉపాధితో ఎదగాలి

* **పాపిరెడ్డి నగర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, సీనియర్ నేత భాస్కర్ రెడ్డి లు**



శేరిలింగంపల్లి , ప్రజాస్ఫూర్తి : ప్రతి ఒక్కరు స్వయం ఉపాధితో ఎదగాలని పాపిరెడ్డి నగర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, సీనియర్ నేత భాస్కర్ రెడ్డి లు అన్నారు. కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అమృతం కిచెన్స్ ను వారు ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు సతీష్ కుమార్ రెడ్డి, కిరణ్మయి లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, చంద్రయ్య, శ్రీకాంత్ రెడ్డి, కనక రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ దయాల్ సేవలు భేష్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారిగా, నోడల్ అధికారిగా గత ఆగస్టు వరకు సమర్ధవంతంగా, అత్యంత నిజాయితీతో విధులు నిర్వర్తించి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిన డాక్టర్ దయాల్ సేవలను రాష్ట ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగిత రాణా ప్రత్యేక లేఖ ద్వారా ప్రశంసించారు.ఆ లేఖ ప్రతిని శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డాక్టర్ దయాల్ కు అందజేశారు. ప్రాథమిక విద్య పటిష్టతకు దయాల్ చేసిన సూచనలను ప్రభుత్వం గమనించడం గొప్ప విషయమని కలెక్టర్ పేర్కొన్నారు.దయాల్ అంకితభావాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, విద్యాశాఖకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు రావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. ఆయన నిస్వార్ధ సేవలను స్ఫూర్తిగా తీసుకుని విద్యారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# 14వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిగా తాండ్ర నాగబాబు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. రామవరం 14వ డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాండ్ర నాగబాబు నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో రిటర్నింగ్ అధికారికి పత్రాలు సమర్పించారు. అలాగే 15వ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆకునూరి సుప్రియ తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు సమష్టిగా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

## మహాత్ముడి అహింసా మార్గంలోనే
# తెలంగాణ ను సాధించిన రాష్ట్ర సాధకులు కెసిఆర్

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మహాత్ముడి అహింసా మార్గంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన రాష్ట్ర సాధకులు మాజీ సీఎం కెసిఆర్ అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని తెలంగాణ భవన్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలు వేసి అంజలి ఘటించి ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ సూచించిన శాంతి, అహింస మార్గాల స్ఫూర్తితో 13 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ సాధించారన్నారు. గాంధీ జీ సూచించిన శాంతి, అహింస మార్గాలను అనుసరించి దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా, అమెరికాలో సర్ మార్టిన్ లూథర్ కింగ్ అక్కడ స్వేచ్ఛాయుత వాతావరణాన్ని అందించడంలో సఫలీకృతమయ్యారన్నారు. మహాత్మా గాంధీ సూచించిన శాంతి, అహింస మార్గాల ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చునని తెలిపారు.



## వైభవంగా శ్రీశ్రీశ్రీ జగదాంబ దేవాలయం
# 19వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : అమ్మవారి కృపా కటాక్షాలు, సంపూర్ణ ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ శివాలయ నగర్ లోని శ్రీశ్రీశ్రీ జగదాంబ దేవాలయం 19వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థాన మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల ఆంజనేయులు, ఫిరోజ్, కోలా శ్రీకాంత్ ముదిరాజ్, మక్సూద్ అలీ, దేవాలయ కమిటీ అధ్యక్షులు గోపాల్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి శంకర్ పవర్, సభ్యులు వి. లక్ష్మణ్ పవార్, ప్రసాద్ నాయక్, రాజేందర్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి కృషి

* **100కెవి ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం**
* **సురుగు గౌరీశ్రీనివాస్ గౌడ్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్ సురుగు గౌరీశ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం నాగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 100కెవి ట్రాన్స్ ఫార్మర్ ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ లోవోల్టేజి సమస్యతో గ్రామంలో కొన్ని ఇళ్ళలో ఫ్యాన్లు తిరగడం లేదని ఏఈ దృష్టికి తీసుకు వెళ్ళానన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించారన్నారు. వెంటనే స్పందించి, లోవోల్టేజి సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప స్తంభాలను తొలగించి, రోడ్డు అంచున సిమెంటు స్తంభాలను నాటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనూప్ రెడ్డి, శ్రీ ఆదిమహావిష్ణువు దేవాలయ కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి, పన్నాల రాజిరెడ్డి, బొమ్మ మైసయ్య, లైన్ మెన్ సూర్యనారాయణ , అసిస్టెంట్ లైన్ మెన్ కిషోర్ కుమార్, వార్డు సభ్యులు, ఊదరి రమేష్, దోనూరి కిరణ్, బొమ్మ అమరావతి, పాక రాము, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ముస్తాబాద్‌లో కచ్చా మోరీ కష్టాలకు చెక్

* **రంగంలోకి దిగిన సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి**
* **రాజీవ్‌నగర్ డ్రైనేజీ సమస్యపై సర్పంచ్ తక్షణ స్పందన..**
* **త్వరలోనే శాశ్వత పరిష్కారం**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 8వ వార్డు రాజీవ్‌నగర్ నివాసితుల సుదీర్ఘ కాలపు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నూతన సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి నడుం బిగించారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామ పంచాయతీలో పాలక వర్గం లేకపోవడంతో ఈ ప్రాంత అభివృద్ధి కుంటుపడి, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.గతంలో రాజీవ్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం జరిగింది. అయితే, అప్పట్లో ఇళ్లు లేని కారణంగా కొంత భాగం నిర్మాణం చేపట్టకుండా వదిలేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో, మురుగు నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ లేక నీరంతా కచ్చా మోరీల గుండా ప్రవహిస్తోంది. దీనివల్ల దుర్వాసన రావడమే కాకుండా, ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి శుక్రవారం ఆ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి, సమస్య తీవ్రతను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నూతన పాలక వర్గం ఏర్పడిన నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. రాజీవ్‌నగర్‌లో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి, ప్రజలకు మురుగు కష్టాల నుండి శాశ్వత విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంట పలువురు వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ లో జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ లో స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు జల్దా రాఘవులు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమానికి రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ హాజరై గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజామియా,మేకల ఎల్లయ్య, ఎర్వ శంకరయ్య, జల్దా లక్ష్మి నాథ్, అబ్దుల్ ఖాదర్, సుధాకర్, శ్రీనివాస్ గౌడ్,జలీల్ ఖాన్, బంటీ శ్రీనివాస్,సత్యనారాయణ, బిర్జు సింగ్, నర్సింహా,వాజీద్, సిరాజ్, హాశం,యాది రెడ్డి,నీలగిరి, షకీల్, షాకీర్, శ్రీను,అలాఉద్దీన్,సందీప్, ఆనంద్,టింకు గౌడ్, కమలా భాయ్,మెహబూబీ తదితరులు పాల్గొన్నారు.

## వన దేవతల సాక్షిగా
# చిన్నారి హరిత సందేశం

* **సమ్మక్క పేరుతో ట్రైనీ డిఎస్పి అగర్వాల్ కు మొక్క అందజేత**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మొక్కలు నాటి పరిరక్షించాలని పిలుపునిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం రామవరం ప్రాంతానికి చెందిన చిన్నారి నైనిక రజువా ప్రత్యేక చైతన్యం కల్పిస్తోంది. సెయింట్ మేరీస్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న ఆమె దేశ ప్రధాని నరేంద్ర మోడీ చే ప్రసంశలు లందుకున్న ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్,సింగరేణియన్ మొక్కల రాజశేఖర్ వద్ద ప్రకృతి హరిత దీక్ష తీసుకున్న నైనిక రజువా "ప్రకృతి హరిత దీక్ష - భావితరాలకు రక్ష" నినాదంతో మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరలో హరిత సందేశాన్ని వ్యాప్తి చేసింది.జాతర సందర్భంగా సమ్మక్క పేరుతో ఒక మొక్క, సారలమ్మ పేరుతో మరో మొక్కను తీసుకుని ప్రకృతి హరిత దీక్ష కండువా ధరించి జంపన్న వాగు స్వాగత తోరణం వద్ద నుంచి మొక్కలు నాటాలని ప్రచారం చేసింది. గద్దెల వద్ద మొక్కలను సమర్పించేందుకు వెళ్లిన సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా ట్రైనీ డీఎస్పీ అగర్వాల్‌కు సమ్మక్క పేరుతో ఉన్న మొక్కను బహుమతిగా అందజేసింది. మరో మొక్కను తానే పరిరక్షిస్తానని తల్లులను ప్రార్థించింది.చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న నైనికను ట్రైనీ డీఎస్పీ అగర్వాల్ అభినందించారు. గతంలో తిరుమల మెట్ల మార్గంలో కూడా హరిత ప్రచారం నిర్వహించిన ఆమె, అదే స్ఫూర్తితో మేడారం జాతరలో లక్షలాది భక్తుల మధ్య ప్రకృతి సందేశాన్ని పంచడం విశేషంగా నిలిచింది.

# తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలు.. నోటిఫికేషన్ విడుదల


రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 202627 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 6వ తరగతిలో కొత్తగా చేరే విద్యార్థులతో పాటు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 28 వరకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 19 న రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 నుండి 12 వరకు 6 వ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు 7 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు పరీక్ష జరగనుంది. ఆసక్తి గల విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ www.toms.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

# డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

TELANGANA Housing Corporation Limited

రాష్ట్రంలోని డబుల్ బెడ్రూం (2బీహెచ్కే) ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వివిధ ఇంజనీరింగ్ శాఖల పర్యవేక్షణలో ఉన్న అన్ని 2బీహెచ్కే ప్రాజెక్టులను ఇకపై తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీహెచ్సీఎస్) పరిధిలోకి బదిలీ చేస్తూ రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరింత వేగంగా నిర్మాణాలు, ప్రాజెక్టుల పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు జీవో ఎంఎస్ నంబర్ 5ను విడుదల చేశారు. గతంలో ఇతర ఇంజనీరింగ్ శాఖలకు అప్పగించిన అన్ని డబుల్ బెడ్రూం ప్రాజెక్టులను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాల్లో ఉన్న ప్రాజెక్టులను ప్రస్తుత ఏజెన్సీల నుండి సంబంధిత హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రాజెక్టులను బదిలీ చేసే బాధ్యతను కమిషనర్కు అప్పగించారు. ఇళ్ల పూర్తి, కేటాయింపు ప్రక్రియలో గత ఏడాది మార్చి 22న విడుదల చేసిన జీవో నంబర్ 33లోని సమగ్ర మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# సందట్లో సడేమియా... జాతరలో మొబైల్ ఛార్జింగ్ దందా



ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం మహా జాతర కన్నుల పండుగగా జరుగుతోంది. లక్షలాదిగా భక్తులు సమ్మక్క సారక్కను దర్శించుకునేందుకు బారులు తీరారు. మేడారం ఎటుచూసినా జనసంద్రంగా మారింది. అయితే జాతరలో కాదేది వ్యాపారానికి అనర్హం అన్నట్టుగా మారింది. జాతరలో మొక్కులు తీర్చుకోడానికి వచ్చిన భక్తులకు జంపన్న వాగు వద్ద 50 రూపాయలకు బకెట్ వేడినీళ్లు అమ్మడం హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. అలాగే ఫోన్ ఛార్జింగ్ పాయింట్లతో కూడా వ్యాపారం మొదలు పెట్టారు. కొందరు జాతరలో మైబైల్ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి, అందుకుగాను ఒక్కో ఫోనుకు 50 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇది మాత్రమే కాదు స్నానఘట్టాల వద్ద బ్యాగులకు కాపలా అంటూ.. ఒక్కో బ్యాగుకు 50 రూపాయలు వసూలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్ష సాధింపు చర్యే

* **బీఆర్ఎస్ వీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఎండీ నవాజ్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేయడాన్ని బీఆర్ఎస్ వీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఎండీ నవాజ్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో ప్రస్తుతం ప్రజాపాలన కాకుండా నోటీసుల పాలన, డైవర్షన్ పాలన నడుస్తోందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాటుపడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను, బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేకనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాంటి నోటీసుల డ్రామాలు ఆడుతూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు భయపడరని, సింహాల్లా గర్జిస్తూ కాంగ్రెస్ అరాచకాలను ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. కేసీఆర్ వెంట తెలంగాణ సమాజమంతా ఉందని, అక్రమ కేసులపై ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను గమనిస్తున్న ప్రజలు, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఎండీ నవాజ్ హెచ్చరించారు.



# గద్దెపై కొలువు దీరిన తల్లీ బిడ్డలు

* **వనదేవతల సమరం... ముస్తాబాద్‌లో భక్తి సాగరం**
* **ముస్తాబాద్ వీధుల్లో ఆధ్యాత్మిక వెల్లువ...**
* **వనదేవతల నామస్మరణతో మార్మోగుతున్న జాతర**
* **బంగారం సమర్పించి పునీతులవుతున్న భక్తులు**
* **26 ఏళ్ల సంప్రదాయం.. ఐదు రోజుల ఆధ్యాత్మిక ఉత్సవం**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రం వనదేవతల నామస్మరణతో మార్మోగుతోంది. గత 26 సంవత్సరాలుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ సమ్మక్కసారలమ్మల జాతర ఈ ఏడాది జనవరి 28వ తేదీ బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. జాతర తొలిరోజున వేద పండితుల ఆధ్వర్యంలో హోమం జరిపి ఉత్సవాలకు అంకురార్పణ చేయగా, పరిసర గ్రామాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ముస్తాబాద్ పుణ్యక్షేత్రాన్ని తలపిస్తోంది.

* **మొక్కుల పండగ.. ముస్తాబాద్ వీధుల్లో బోనాల కోలాహలం**

జాతరలో భాగంగా రెండవ రోజైన గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మంగళవాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో తరలిరాగా, సంప్రదాయబద్ధంగా చెట్టు తెచ్చుట, కలశం తెచ్చుట వంటి ఘట్టాలను భక్తులు కనులారా వీక్షించారు. రాత్రి వేళల్లో సాగుతున్న ఒగ్గు కథా పఠనాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతున్నాయి. మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతూ సాగుతున్న ఈ వేడుకలు జాతరకు ప్రత్యేక శోభను తెచ్చిపెట్టాయి.

* **గద్దెలపై కొలువుదీరిన వనదేవతలు.. బంగారం సమర్పించుకుంటున్న భక్తజనం**

జాతరలో అత్యంత ప్రధాన ఘట్టమైన అమ్మవార్లను గద్దెకు తీసుకువచ్చే కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా ముగిసింది. సమ్మక్కసారలమ్మలు గద్దెపై కొలువుదీరడంతో భక్తుల ఆనందోత్సాహాలు మిన్నంటాయి. భక్తులు తమ ఇష్టదైవాలకు మొక్కులు చెల్లించుకుంటూ, అమ్మవార్లకు ప్రీతిపాత్రమైన 'బంగారం' (బెల్లం) సమర్పించి పునీతులవుతున్నారు. ఎటు చూసినా భక్తుల కోలాహలం, అమ్మవార్ల నామస్మరణతో జాతర ప్రాంగణం జనసంద్రంగా మారింది.

* **ముగింపు దిశగా వేడుకలు: జంపన్న రాకతో ముగియనున్న మహా జాతర**

శనివారం జంపన్నను గద్దె వద్దకు తీసుకువచ్చే వేడుక జరగనుంది. ఈ ఐదు రోజుల సుదీర్ఘ జాతర ఫిబ్రవరి 01 (ఆదివారం) జంపన్నను సాగనంపుట, ఒగ్గు వల్లచే బోనం తీయుట, ఒగ్గు కథా పఠనంతో మంగళప్రదంగా ముగియనుంది. పాతికేళ్లకు పైగా భక్తితో జరుపుకుంటున్న ఈ ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని, వనదేవతల ఆశీస్సులు పొందాలని జాతర నిర్వహణ కమిటీ, భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

# బొజ్జాయిగూడెం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఇల్లందు మండలం బొజ్జాయిగూడెం గద్దెలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు.సమ్మక్కసారలమ్మ గద్దెలను ఎస్పీ దర్శించుకున్నారు. గద్దెల దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటుచేసిన బందోబస్తును పరిశీలించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు,సిబ్బందికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి వెంకన్నబాబు, ఇల్లందు సీఐ సురేష్, టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ ,సిబ్బంది పాల్గొన్నారు.

# నిజం చెబితే.. మున్సిపల్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటాం : MP అర్వింద్ సంచలన సవాల్

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వద్ద నిధులు లేవని ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను పదేళ్ల పాటు బీఆర్ఎస్ నేతలు మింగితే.. ఇప్పుడు కాంగ్రెస్ నేతలు మింగేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరూ తోడు దొంగలు అని అన్నారు. అందుకే కేసీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు రేవంత్ రెడ్డి భయపడుతున్నారని విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ ఏ పార్టీలో ఉన్నారో చెబితే.. తాము జగిత్యాల మున్సిపల్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటామని సంచలన సవాల్ చేశారు.

# మేడారం మహాజాతర.. మూడో రోజు భక్తుల రద్దీ

**మేడారం మహాజాతర మూడో రోజు కొన సాగుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మేడారం జనసంద్రంగా మారింది. దీంతో అక్కడి రహదారులన్నీ రద్దీగా మారాయి. జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు గద్దెల వద్ద అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఆ ఫోటోలు..**












# వింగ్స్ ఇండియా ప్రదర్శన.. విమానాల విన్యాసాలు!

హైదరాబాద్: భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ఆధ్వర్యంలో బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా-2026 విమానయాన ప్రదర్శన మూడోరోజు కొనసాగుతోంది. ఆకాశంలో విహరిస్తూ భారీ శబ్దం, పొగతో విమానాలతో చేసే విన్యాసాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనను తిలకించేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. ఆ చిత్రాలు..















## ఈఏపీ సెట్ దరఖాస్తుల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణ ఈఏపీ సెట్ దరఖాస్తుల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 19 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 4 తుది గడువు. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో మే 4 నుంచి 11 వరకు ఈఏపీసెట్ నిర్వహించనున్నారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ



హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ ప్రారంభించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై విచారణ చేపట్టారు. కౌశిక్ రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఇతరులు వేసిన అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది. పిటిషనర్ల వాదనలు విని సాక్ష్యాలను స్పీకర్ నమోదు చేయనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ విచారణను స్పీకర్ చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న 3 అనర్హత పిటిషన్లపై గతంలోనే సుప్రీంకోర్టు వివరణ కోరింది. విచారణ జరిపి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించింది.



## మేళ్లచెరువు రక్షణకు నడుం బిగించిన హైడ్రా

జిన్నారం: రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మేళ్లచెరువు రక్షణకు హైడ్రా నడుం బిగించింది. శుక్రవారం తెల్లవారుజామునే పోలీసులతో కలిసి ప్రత్యేక బృందాలు చెరువు సరిహద్దులను గుర్తించాయి. కంచె వేసేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో కొందరు ఎఫ్టీఎల్ పరిధిలో మట్టిని పోసి చెరువును ఆక్రమించే ప్రయత్నం చేశారు. సమస్యను గ్రామస్థులు హైడ్రా దృష్టికి తీసుకువచ్చారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంబంధిత వ్యక్తులను హెచ్చరించినా తీరు మారలేదు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా చర్యలకు ఉపక్రమించింది. కొల్లూరు పోలీసులు, హైడ్రా ప్రత్యేక విభాగం బందోబస్తు నిర్వహించింది.

## పథకం ప్రకారమే నల్లమలసాగర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారు: హరీశ్‌రావు

హైదరాబాద్: పథకం ప్రకారమే పోలవరంనల్లమలసాగర్‌కు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. సుప్రీంకోర్టులో ఈ ప్రభుత్వం చెల్లని పిటిషన్ వేసి రిట్‌ను ఉపసంహరించుకున్నారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియా సమావేశంలో మాట్లాడారు. ''ప్రస్తుతం దిల్లీలో జరుగుతున్నది పేరుకే జలవివాదాల కమిటీ సమావేశం. పోలవరంనల్లమలసాగర్‌కు పరిష్కారం కోసమే ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. 200 టీఎంసీల గోదావరి జలాలను ఏపీకి తరలించుకుపోయే కుట్ర జరుగుతోంది. నేను ప్రశ్నించిన తర్వాత వ్యతిరేకిస్తున్నట్లు కేంద్రానికి లేఖ రాశారు. రెండు కండీషన్లు పెట్టి దిల్లీలో సమావేశానికి వెళ్లారు. ఏపీ ప్రభుత్వం నల్లమలసాగర్‌కు డీపీఆర్ ఆపాలని, ఈ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇవ్వొద్దని రెండు షరతులు విధించారు. వీటికి కేంద్రం ఎలాంటి హామీ ఇవ్వకుండానే సమావేశానికి ఎందుకు వెళ్లారు? నల్లమలసాగర్‌కు అంగీకరించి తెలంగాణకు మరణశాసనం




రాయాలని అనుకుంటున్నారా? ఈ సమావేశానికి కూడా ఆదిత్యనాథ్‌దాసునే పంపించారు. ఆయన గతంలో ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కేంద్రానికి లేఖలు రాశారు. మన ప్రాజెక్టులకు అడ్డుపడిన వ్యక్తి ఇవాళ ఈ రాష్ట్రం తరఫున వాదనలకు వెళ్లారు. కేసీఆర్ ప్రభుత్వం గోదావరిపై 7 ప్రాజెక్టులకు డీపీఆర్‌లను పంపించింది. బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో మరో పోరాటానికి మేం సిద్ధంగా ఉన్నాం. చంద్రబాబు ఒత్తిడితో దిల్లీలో జరుగుతున్న సమావేశాన్ని రాష్ట్రం బహిష్కరించాలి. కాదని పాల్గొంటే మరో పోరాటానికి సిద్ధం కావాలి. తెలంగాణ నీళ్లు ఏపీకి ధారాదత్తం చేస్తుంటే చూస్తూ ఊరుకోం''అని హరీశ్‌రావు అన్నారు.

## ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగాలి: కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ చేపట్టిన విచారణకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ.. తాను హాజరైనట్లు తెలిపారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరాం. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగాలని విన్నవించాం. భాజపా, కాంగ్రెస్ ఒక్కటే.. వారి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉంది'' అని కౌశిక్ రెడ్డి అన్నారు. ఇక గురువారం జరిగిన ఘటనపై స్పీకర్‌కు ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినట్లు కౌశిక్‌రెడ్డి తెలిపారు. తన సొంత



గ్రామం వీణవంకలో పోలీసులు ఓవరాక్షన్ చేశారని ఆరోపించారు. ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. తనకు న్యాయం జరిగే వరకూ అధికారులను వదిలిపెట్టనని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా వీణవంకలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరలో దళిత సర్పంచి సరోజను కొబ్బరికాయ కొట్టనివ్వడం లేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం రాత్రి నిరసన తెలిపారు. సమ్మక్క గద్దెకు చేరిన తరువాత మొదటి కొబ్బరికాయ తామే కొడతామని ఆయన భీష్మించారు. దళిత మహిళా సర్పంచిని అవమానించిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, భక్తులకు ఇబ్బంది కలుగుతుందని పోలీసులు సర్దిచెప్పినా వినలేదు. దీంతో కౌశిక్‌రెడ్డితోపాటు ఆయన సతీమణిని బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు ముగిసిన గడువు

హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఇవాళ సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు ముగియగా.. అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్న వారిని నామినేషన్ వేసేందుకు అనుమతిస్తున్నారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు ఉంది. రాష్ట్రంలో మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న



ఓట్ల లెక్కింపు. మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులకు ఎస్ఈసీ టీఈ పోల్ మొబైల్ యాప్ ఏర్పాటు చేసింది. tsec.gov.in ద్వారా కూడా ఫిర్యాదులకు అవకాశం కల్పించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

## పోలవరంనల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించాం

**: మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్: పోలవరంనల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో ఇవాళ జరిగిన సమావేశంలో అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఇవాల్టి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు.

# సోషల్ మీడియాలో ప్రభుత్వ ఉద్యోగులు.. ఖాతా తెరవాలంటే అనుమతి తీసుకోవాల్సిందే!

ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి బిహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాతోపాటు యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ వేదికల్లో ప్రవర్తనపై మార్గదర్శకాలను రూపొందించింది. ఉన్నతస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఉద్యోగులందరికీ ఇవి వర్తిస్తాయని స్పష్టం చేసింది. దీనికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపగా.. ఉద్యోగుల సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించే ఉద్దేశం లేదని, డిజిటల్ వేదికల్లో హుందాగా వ్యవహరించేలా చూడడమే తమ ఉద్దేశమని బిహార్ ప్రభుత్వం పేర్కొంది.




- * తాజా మార్గదర్శకాల ప్రకారం.. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి సోషల్ మీడియా ఖాతా తెరవాలంటే సంబంధిత శాఖ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే. నకిలీ ఖాతాలు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించే ప్రసక్తే లేదు.
- * అధికారిక హోదా, ప్రభుత్వ లోగో లేదా హోదాకు సంబంధించి ఎటువంటి పోస్టులూ ఆన్‌లైన్‌లో పెట్టకూడదు.
- * వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలకు ప్రభుత్వ ఈమెయిల్ ఐడీలు లేదా ప్రభుత్వ ఫోన్ నంబర్లను వాడొద్దు. ఉద్యోగుల వ్యక్తిగత అభిప్రాయాలకు ప్రభుత్వ హోదాతో సంబంధం లేదని స్పష్టంగా చెప్పడమే దీని ఉద్దేశం.
- * అశ్లీలంతోపాటు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే కంటెంట్.. కుల, మతాలను లక్ష్యంగా చేసుకొని చేసే పోస్టులపై నిషేధం.
- * అధికారిక కార్యక్రమాలు, సమావేశాల వీడియోలు, ఫొటోలు కూడా ఆన్‌లైన్‌లో షేర్ చేయొద్దు.
- * ఎటువంటి కంటెంట్ పోస్టు లేదా షేర్ చేయవచ్చనే దానిపై నిబంధనలను స్పష్టంగా పేర్కొన్నట్లు బిహార్ ప్రభుత్వం చెప్పింది.

## ఒలింపిక్ క్రీడాకారుడి తల్లిని హిప్నటైజ్ చేసి.. బంగారం చోరీ!

దెహ్రాదూన్: ఒలింపిక్ క్రీడాకారుడి తల్లిని హిప్నటైజ్ చేసి.. దాదాపు రూ.5లక్షల విలువైన బంగారం, నగదు చోరీ చేసిన ఘటన ఆసల్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరాఖండ్‌లోని దెహ్రాదూన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒలింపిక్ క్రీడాకారుడు సురాజ్ పన్వర్ తల్లి పూనమ్ పన్వర్ బుధవారం ఉదయం బైపాస్‌లోని తన ఇంటి నుంచి ఆఫీస్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. చంద్రబానీ చౌక్ ప్రాంతం సమీపంలో పూనమ్ నడిచి వెళ్తుండగా.. ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చి మాటలు కలిపాడు. ఆమెతో కొంత దూరం నడిచిన తర్వాత మరో వ్యక్తి వారికి తోడయ్యాడు. మాటల్లో భాగంగా తనకు క్షుద్ర శక్తులపై




పట్టు ఉందని అతడు వారిని నమ్మించాడు. అనంతరం కొన్ని మంత్రాలు వేసి.. ఆమెను చెట్టు కిందకు తీసుకువెళ్లాడు. దుండగులిద్దరూ మహిళ పర్సులోని రూ.1,100 నగదు, ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ దోపిడీ ఘటనపై పూనమ్ పోలీసులను ఆశ్రయించారు. తాము చెప్పినట్లు చేయకపోతే ఇంటికి నిప్పంటిస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉత్తరాఖండ్‌కు చెందిన సూరజ్ పన్వర్ 2018లో జరిగిన సమ్మర్ యూత్ ఒలింపిక్స్‌లో పురుషుల 20కి.మీ రేస్ వాక్‌లో రజత పతకంతో మెరిశాడు.

## ఐటీ సోదాలు జరుగుతుండగానే.. గదిలో రియల్టర్ ఆత్మహత్య!

బెంగళూరులో ఓ రియల్టర్ ఆఫీసులో ఆదాయపు పన్ను అధికారులు సోదాలు నిర్వహిస్తున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాని సీజే రాయ్ .. తన కార్యాలయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రైవేటు గదిలోకి వెళ్లిన ఆయన లైసెన్స్ గన్‌తో కాల్చుకున్నట్లు తెలుస్తోంది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా రాయ్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాన్ఫిడెంట్ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సీజే రాయ్.. కర్ణాటక, కేరళలతోపాటు యూఏఈలోనూ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థపై ఇటీవల దృష్టి సారించిన ఐటీ శాఖ.. గత రెండు మూడు రోజులుగా బెంగళూరులోని ఆఫీసుల్లో సోదాలు చేపట్టింది. ఈ క్రమంలో రిచ్‌మండ్ సర్కిల్ సమీపంలో ఉన్న ఆఫీసులో శుక్రవారం ఉదయం నుంచి ఐటీ అధికారులు సోదాలు కొనసాగించారు. ఇదే సమయంలో మధ్యాహ్నం ఆఫీసుకు వచ్చిన రాయ్‌ను.. ఐటీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని డాక్యుమెంట్లు తీసుకొని వస్తానని చెప్పి తన ప్రైవేటు గదిలోకి వెళ్లిన ఆయన




లైసెన్స్ గన్‌తో కాల్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని విదేశాల్లో ఉంటున్న ఆయన కుటుంబీకులకు తెలియజేసినట్లు బెంగళూరు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. కేరళకు చెందిన రాయ్.. పలు మలయాళీ సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు.

## ఆటిజం చికిత్సలో స్టెమ్ సెల్స్ థెరపీ వాడొద్దు!



**: సుప్రీంకోర్టు**

ఆటిజం క్లినికల్ చికిత్సకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీని చికిత్సలో మూలకణ థెరపీని ఉపయోగించడం అనైతికమని, దీన్ని కొనసాగించడం ఉల్లంఘనే అవుతుందని పేర్కొంది. ఆమోదిత, వైద్య పర్యవేక్షణలో చేసే క్లినికల్ ట్రయల్స్ కోసం మాత్రమే ఈ థెరపీని అనుమతించాలని స్పష్టం చేసింది. స్టెమ్ సెల్స్ థెరపీతో ఆటిజం నయమవుతుందని విపరీతంగా ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ ముంబయికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ఈ చికిత్స ప్రభావంతమైందని నిరూపించేందుకు తగిన శాస్త్రీయ ఆధారాలు లేవని అభిప్రాయపడింది. థెరపీల్లో ఉపయోగించే స్టెమ్ సెల్స్‌ను డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940లో 'డ్రగ్స్'గా పేర్కొన్నంత మాత్రాన చికిత్సలో దీన్ని ఉపయోగించలేమని పేర్కొంది. రోగులు, సంరక్షకులు చికిత్స ప్రయోజనాలు ఆశిస్తుంటారని.. ఇటువంటి నేపథ్యంలో దీన్ని ఉపయోగించడం అనైతికం, వైద్య నిబంధనల ఉల్లంఘనే అవుతుందని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఇప్పటికే ఈ తరహా చికిత్స తీసుకుంటున్న రోగులకు విషయానికొస్తే.. వాణిజ్య ప్రయత్నంగా వీటిని కొనసాగించలేమని స్పష్టం చేసింది. అయితే, వీరిని క్లినికల్ ట్రయల్స్ చేస్తున్న కేంద్రాలకు తరలించేంత వరకు ఎయిమ్స్ అధికారులతో సంప్రదించి ఉత్తమ పరిష్కార మార్గాలు చూపాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖను ఆదేశించింది.

## కువైట్‌దిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు అత్యవసర ల్యాండింగ్


కువైట్ నుంచి దిల్లీ బయల్దేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కువైట్ నుంచి దిల్లీ బయల్దేరిన ఇండిగో విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై విమానంలో బాంబు పెట్టినట్లు రాసి ఉన్న బెదిరింపు నోట్‌ని ఓ ప్రయాణికుడు గుర్తించి, సిబ్బందిని అప్రమత్తం చేశాడు. వెంటనే స్పందించిన పైలట్లు అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. దీంతో విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు.




శుక్రవారం ఉదయం 6.40గంటలకు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను కిందకు దించేసి, విమానంలో తనిఖీలు చేశారు. ఇప్పటి వరకు ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదని.. అధికారుల తుది అనుమతి పొందిన తర్వాత విమానం తిరిగి దిల్లీకి బయల్దేరే అవకాశం ఉందని విమానాశ్రయ అధికారి తెలిపారు. ఘటన సమయంలో విమానంలో 180 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

## ఎన్సీపీ 'రీయూనియన్' ఫిక్స్.. ఫిబ్రవరిలో ప్రకటన..?

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఆకస్మిక మరణం తర్వాత మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్సీపీకి చెందిన రెండు వర్గాలు విలీనమయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరి రెండో వారంలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు వర్గాలను విలీనం చేసే ఉద్దేశంతో గత కొంతకాలంగా అజిత్ పవార్ తన బాబాయ్ శరద్ పవార్‌తో అనేకమార్లు భేటీ అవుతూ వచ్చారట. ఆ వర్గానికి చెందిన సుప్రియా సూలే, జయంత్ పాటిల్‌తో కూడా చర్చలు



జరిపారు. ఈ పరిణామాల గురించి సీనియర్ భాజపా నేతలకు కూడా సమాచారం ఇచ్చారని, ఆ వివరాలు వెల్లడించారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పుడు పార్టీ బాధ్యతలు చేపట్టే అవకాశాలున్న వారి జాబితాలో శరద్‌పవార్‌తో పాటు అజిత్ సతీమణి సునేత్ర పవార్, సీనియర్ పవార్ కుమార్తె సుప్రియా సూలే, అజిత్ వర్గానికి చెందిన ప్రఫుల్ పటేల్ ఉన్నారని సమాచారం. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో శరద్ పవార్‌అజిత్ పవార్ నాయకత్వాల్లోని ఎన్సీపీ వర్గాలు కలిసిపోటీ చేసిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఆ నిర్ణయం తీసుకున్నామని అప్పట్లో అజిత్ వెల్లడించారు. ఈ నిర్ణయం ఎన్నికల్లో ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా.. రెండు వర్గాలు ఒక్కటవుతాయనే ప్రచారం మాత్రం ఊపందుకుంది.

*** ఫడణవీస్‌ను కలిసి ఎన్సీపీ నేతలు..**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ను ఎన్సీపీ నేతలు శుక్రవారం కలిశారు. సీఎం నివాసంలో గంటన్నరపాటు చర్చలు జరిపారు. వారిలో ఛగన్ బుజ్బల్, ప్రఫుల్ పటేల్, ధనుంజయ్ ముండే వంటి వారున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అజిత్ మరణంతో నాయకత్వ లోటును ఎదుర్కొంటున్న నేతలు ఏ అంశాలపై చర్చించారో తెలియాల్సి ఉంది.

## 'సంచార్ సాథీ'తో కోటిన్నర మొబైల్ నంబర్లు బ్లాక్

**: కేంద్రం**


సైబర్ నేరాలు, చోరీలను అరికట్టడానికి తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్‌నకు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు 2 కోట్లకు పైగా మంది 'సంచార్ సాథీని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈ యాప్ సాయంతో చట్టవ్యతిరేక, అనుమానాస్పద కార్యకలాపాలతో సంబంధం ఉన్న 1.52 కోట్ల మొబైల్



నంబర్లను బ్లాక్ చేశామన్నారు. మోసపూరిత సిమ్‌లతో ముడిపడి ఉన్న 27 లక్షల వాట్సప్ ఖాతాలతో పాటు ఇతర డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లను కూడా బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసాలను ఎదుర్కొనే బలమైన ఆయుధంగా సంచార్ సాథీ పనిచేస్తోందన్నారు. గతంలో విదేశీ కాలర్ల నుంచి సుమారు 1.35 కోట్ల నకిలీ కాల్స్ రికార్డు అయ్యేవని.. ప్రస్తుతం అటువంటి కాల్స్ దాదాపు 95 శాతం మేర తగ్గాయని మంత్రి వివరించారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత జీవితాలపై నిఘా పెడుతుందనే ఆరోపణల్లో నిజం లేదని మంత్రి పేర్కొన్నారు. అసలు స్నూపింగ్‌కు తావే లేదని, అది సాధ్యం కాదని పేర్కొన్నారు.

### పర్యాటకురాలికి చేదు అనుభవం..
## 400 మీటర్లకు రూ.18వేలు వసూల్

భారత్ వచ్చిన ఓ అమెరికన్ పర్యటకురాలికి చేదు అనుభవం ఎదురైంది. ముంబయి నగరంలో కేవలం 400 మీటర్ల ప్రయాణానికి ఓ ట్యాక్సీ డ్రైవర్ ఏకంగా ఆమె నుంచి రూ.18వేలు వసూలు చేశాడు. ఈ మేరకు పర్యటకురాలు చేసిన పోస్ట్‌కు పోలీసులు స్పందించి ఆ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. అర్జెంటీనా అరియానో అనే ఎక్స్ ఖాతా కలిగిన ఒకరు పోస్టు పెట్టారు. దాని ప్రకారం.. 'ఇటీవల ముంబయిలో దిగి స్టార్ హోటల్‌కు వెళ్లేందుకు ఓ ట్యాక్సీని మాట్లాడుకున్నాం. డ్రైవర్, మరో వ్యక్తి తొలుత మమ్మల్ని తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. మా నుంచి రూ.18,000 వసూలు చేసి.. ఆ తర్వాత 400 మీటర్ల దూరంలోని ఓ హోటల్ వద్ద దింపారు' అని రాసుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆ ట్యాక్సీకి సంబంధించిన వివరాలు కూడా యూజర్ వెల్లడించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ముంబయి పోలీసు విభాగానికి ట్యాగ్ చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేసి మూడు గంటల్లో ట్యాక్సీ డ్రైవర్ దేశరాజ్ యాదవ్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఆ పర్యటకురాలిని సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదని అధికారులు తెలిపారు.



## నిజాం నగలు.. ఆర్‌బీఐ వద్ద సేఫ్: కేంద్రం

నిజాం నగలు కేంద్ర రిజర్వ్‌బ్యాంక్ వద్ద సురక్షితంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆ ఆభరణాల చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ ప్రాముఖ్యతను గుర్తించి అధిక భద్రత మధ్య వాటిని ఉంచామని పేర్కొంది. ఈ వివరాలను రాజ్యసభలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ రాతపూర్వకంగా వెల్లడించారు. వాటిని హైదరాబాద్‌లో ప్రజల సందర్శనకు ఉంచే అంశంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. నిజాం పాలకులకు చెందిన 173 అద్భుతమైన ఆభరణాలు 1995 నుంచి ఆర్‌బీఐ వాల్ట్స్‌లోనే భద్రంగా ఉన్నాయని ప్రభుత్వానికి తెలుసా..? అని కొందరు సభ్యులు మంత్రిని ప్రశ్నించారు. దీనికి ఆయన తెలుసని బదులిచ్చారు. నిజాంలు హైదరాబాద్‌ను పాలించారు. స్వాతంత్ర్యానంతరం ఈ భూభాగం భారత్‌లో విలీనమైంది.

## పీటీ ఉష భర్త శ్రీనివాసన్ కన్నుమూత

రాజ్యసభ ఎంపీ, భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉష భర్త వెంగలిల్ శ్రీనివాసన్ కన్నుమూశారు. తమ నివాసంలో శుక్రవారం తెల్లవారుజామున 12.30 గంటల ప్రాంతంలో శ్రీనివాసన్ (67) ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబసభ్యులు ఆయనను పెరుమాళ్‌పురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

# ఈ జంతువులు ఇంట్లో పెరుగుతాయి..!



చిట్టి కుందేలు, బుల్లి ఏనుగు, చిన్ని ఎలుగుబంటి... జూలో ఉండాల్సిన జంతువుల జాబితాను చదువుతున్నట్లు ఉంది కదా! కానీ ఇవన్నీ ఇంట్లో మొక్కల్ని పెంచుకునే 'కోకో కాయిర్ ప్లాంటర్ పాట్స్'. ఈ రోజుల్లో ప్రతి వస్తువూ పర్యావరణహితంగా ఉండాలనుకునే ఇంటీరియర్ ప్రేమికులకోసం ప్రత్యేకంగా వీటిని చేతితో తయారుచేస్తున్నారు తయారీదారులు. ముందు లోపల చిన్న మట్టి కుండీని పెడతారు. తర్వాత కొబ్బరి పీచుని కావాల్సిన ఆకృతిలో మలిచి చింతగింజల గ్లూతో అతికించి, సహజ రంగులు వేసి ఈ ఎకో ఫ్రెండ్లీ పాట్స్‌ని తయారుచేస్తారు. ప్లాస్టిక్ పాట్స్‌కి ప్రత్యామ్నాయంగా వీటిని ఇండోర్, బాల్కనీ, కిచెన్ గార్డెన్, ఆఫీస్ డెస్క్‌ల్లోనూ ఉపయోగించుకోవచ్చు. మొక్కలకు నీటిని పోసినప్పుడు టేబుల్‌పై పడకుండా పీల్చుకోవడంతోపాటు మొక్క ఆరోగ్యంగా ఎదిగేందుకు తోడ్పడతాయి. వేర్లకు సహజంగా గాలి సరఫరా అయ్యేలా చేయడంతోపాటు మట్టి తేమను కోల్పోకుండా కాపాడతాయి. మరి ఆత్మీయుల పుట్టినరోజు, పెళ్లిరోజులకు బహుమతిగా ఇచ్చేయండి.







## మీరూ ఇలాంటి అమ్మాయేనా?



**కొంతమంది అమ్మాయిలు తమలో ఆత్మవిశ్వాసం లోపించిందని.. ఫలితంగా తామేమీ సాధించలేకపోతున్నామని.. ఏ పని చేయాలన్నా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని బాధపడుతుంటారు. అలాంటి వారు ఆత్మవిశ్వాసం మెండుగా ఉండే వారిలో ఎలాంటి లక్షణాలుంటాయో తెలుసుకోగలిగితే.. వారి నుంచి స్ఫూర్తి పొందచ్చని చెబుతున్నారు నిపుణులు.**

సొంతంగా నిర్ణయాలు..

అమ్మాయిలు ఏం చదవాలి.. ఎక్కడ చదవాలి.. ఎలాంటి ఉద్యోగం చేయాలి.. మొదలైన అంశాల్లో కొన్ని కుటుంబాల్లో ఇప్పటికీ తుది నిర్ణయం పెద్దలదే అవుతుంటుంది. వారిది చిన్న వయసు కావడం వల్ల వారికేమీ తెలీదనే భావన కూడా ఇందుకు ఓ కారణం కావచ్చు. అయితే ఆత్మవిశ్వాసం ఉన్న అమ్మాయిల్లో తాము ఏం చేయాలో వారే నిర్ణయం తీసుకొనే సామర్థ్యం ఉంటుందట. అలాగని ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇవ్వరని కాదు. ఎదుటివారి భావాలను గౌరవిస్తూనే.. తమ వాణిని బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటారు. అలాగే తాము తీసుకొన్న నిర్ణయం సరైనదేనా? కాదా? అని ఆలోచించుకోవడంతో పాటు.. దానివల్ల జరిగే మంచిచెడులను కచ్చితంగా బేరీజు వేసుకోగలుగుతారు. ఫలితంగా తమ లక్ష్యం వైపు ప్రోత్సహించేలా కుటుంబ సభ్యులు, స్నేహితులనూ వీరు ఒప్పించగలుగుతారని నిపుణులు చెబుతున్నారు.

**'నో' చెప్పడం తెలుసు..!**

ఎవరైనా మనకు ఏదైనా పని అప్పగించినప్పుడు కొన్ని సందర్భాల్లో ఇష్టం లేకపోయినా.. మొహమాటానికి పోయి ఆ పనిని పూర్తి చేయాల్సి వస్తుంది. అలాంటి సందర్భాల్లో మేం ఈ పని చేయలేమని ధైర్యంగా చెప్పలేకపోతాం. కానీ ఆత్మవిశ్వాసం మెండుగా ఉండే ఈ తరం అమ్మాయిలు తమకు నచ్చని పనులు 'చెయ్యం' అని చెప్పడానికి ఏమాత్రం వెనుకాడరట! అలాగే ఆ పనిని తాము ఎందుకు చేయమంటున్నారో దానికి గల కారణాలను సైతం వారు చెప్పడానికి మొహమాటపడరట!

**అసూయ ఉండదు..**

ఇతరులు తమకంటే కొన్ని విషయాల్లో మెరుగ్గా ఉన్నా లేదా వారు చేస్తున్న పనిలో విజయం సాధించినా వారిని చూసి అసూయపడే వారు చాలామందే ఉంటారు. కానీ ఆత్మవిశ్వాసం ఉన్న వారు ఇతరులను చూసి ఇలా అసూయపడరట. తమ పనేదో తాము చూసుకొని ముందుకు సాగుతుంటారే తప్ప.. ఇతరుల గురించి ప్రతిదీ పట్టించుకోవాలన్న ఆసక్తి వారికుండదు. ఫలితంగా తాము చేస్తున్న పని పైనే పూర్తి శ్రద్ధ పెట్టి, సాధించాలనుకొన్న లక్ష్యాల్ని చేరుకోగలుగుతారు. అంతేకాదు.. అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడానికీ వీరు వెనకాడరట. అలాగే ఇతరులను ప్రోత్సహించడంలోనూ వీరు ముందుంటారు అంటున్నారు నిపుణులు. మరి మీరూ అంతేనా?

# మైదాకు బదులుగా ఇవి..!

**మైదా పిండి.. మనం తీసుకునే ఆహారంలో ఎక్కువగా కనిపించే పదార్థం. బ్రెడ్, సమోసాలు, కేకులు, బిస్కట్లు, బోండాలు.. ఇలా చెప్పకుంటూ పోతే చాలా ఆహార పదార్థాల్లో మైదా కనిపిస్తుంటుంది. అయితే ఈ పిండిలో శరీరానికి కావాల్సిన పోషకాలు తక్కువ మోతాదులో ఉంటాయి. అలాగే రక్తంలోని చక్కెర స్థాయిలను అమాంతం పెంచేస్తుంది. అయితే రుచిగా ఉంటుందనో, తేలిగ్గా వంట పూర్తవుతుందనో చాలామంది ఈ పిండిని వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో మైదాకు బదులుగా కొన్ని పిండి పదార్థాలను ఆహారంలో చేర్చుకోవచ్చంటున్నారు నిపుణులు. ఫలితంగా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చంటున్నారు.**





### రాగి పిండి

ఇటీవలి కాలంలో ఆరోగ్యానికి సంబంధించి జాగ్రత్తలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో భాగంగా చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో రాగులు ముందు వరుసలో ఉంటాయి. రాగుల్లో క్యాల్షియం, ఐరన్‌తో పాటు అమైనో అమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. రాగి పిండితో రోటీల దగ్గర్నుంచీ లడ్డూల వరకు పలు వంటకాలు చేసుకోవచ్చు. అంతేకాదు.. మైదా పిండి లాగా సాగే గుణం కూడా దీనికి ఉండదు. ఇందులోని క్యాల్షియం ఎముకల దృఢత్వానికి ఉపయోగపడుతుంది. పిల్లల దగ్గర్నుంచీ పెద్దల వరకు ప్రతి ఒక్కరూ నిస్సంకోచంగా రాగి పిండిని తీసుకోవచ్చంటున్నారు నిపుణులు.

### ఓట్స్ పిండి

బరువు తగ్గాలనుకునే వారు చాలామంది ఓట్స్‌ని ఆహారంలో భాగం చేసుకుంటారు. ఇందులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. మాంసకృత్తులు, పీచు అధిక మొత్తంలో ఉంటాయి. పీచు వల్ల తిన్న వెంటనే కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే శరీరానికి కావాల్సిన ఇతర పోషకాలు కూడా ఇందులో



మెండుగా ఉంటాయి. ఈ క్రమంలోనే మైదాకు బదులుగా ఓట్స్ పిండిని కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఓట్స్ పిండితో ప్యాన్‌కేక్స్, రోటీలు, కుకీస్, మఫిన్స్‌తో పాటు మసాలా వడలు.. మొదలైనవి కూడా చేసుకోవచ్చు.

### జొన్న పిండి

జొన్నల్లో శరీరానికి కావాల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ఒకప్పుడు వీటిని ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. బియ్యం వినియోగం పెరగడంతో వీటి ప్రాధాన్యం తగ్గింది. అయితే ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునేవారు జొన్నలకు ఇటీవల కాలంలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది జీర్ణశక్తిని మెరుగుపరచడంతో పాటు శరీర బరువుని అదుపులో పెట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. జొన్న పిండితో రొట్టెలతో పాటు దోశలు, ఉప్మా, లడ్డూలు, మఫిన్లు, మురుకులు.. మొదలైనవి కూడా చేసుకోవచ్చు. మైదా పిండికి బదులుగా ఆహారంలో జొన్న పిండిని భాగం చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు.

### గోధుమ పిండి

రిఫైన్డ్ గోధుమల నుంచి మైదా పిండిని తయారు చేస్తారు. ఈ క్రమంలో పలు రసాయనాలనూ కలుపుతారు. అందువల్లే ఇది తెలుపు రంగులో ఉంటుంది. అయితే మైదా కంటే గోధుమ పిండితో చేసిన వంటకాలు మంచివంటున్నారు నిపుణులు. భారతీయ వంటకాల్లో ఎప్పట్నుంచో గోధుమ పిండికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఫైబర్, బి విటమిన్లు.. మొదలైన పోషకాలు ఎక్కువగా ఉంటాయి.





# సినిమా

## సంక్రాంతి వార్



టాలీవుడ్ బాక్సాఫీస్ చరిత్రలో స్టార్‌డమ్‌తో పాటు పోటీని దశాబ్దాలుగా కొనసాగిస్తూ వస్తోన్న హీరోలుగా చిరంజీవి, బాలకృష్ణ ప్రత్యేక గుర్తింపు పొందారు. వీరిద్దరి సినిమాలు విడుదలైన ప్రతీసారి అభిమానుల్లో సహజంగానే పోలికలు, చర్చలు, అంచనాలు మొదలవుతాయి. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్చ నడుస్తోంది. ఇద్దరూ గ్యాంగ్‌స్టర్ నేపథ్య కథల్లో నటిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. మెగాస్టార్ హీరోగా బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న కొత్త చిత్రం గ్యాంగ్‌స్టర్ జానర్‌లో రూపొందనుందట. మాస్ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని పవర్‌ఫుల్ క్యారెక్టర్‌తో చిరును చూపించబోతున్నారని సమాచారం. ఈ చిత్రానికి 'కాకా' అనే టైటిల్ పరిశీలనలో ఉందన్న టాక్ కూడా ఈ వార్తలకి ఊతమిస్తోంది. అదే సమయంలో నటసింహ బాలకృష్ణ కూడా గ్యాంగ్‌స్టర్ కథతోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారని వినిపిస్తోంది. వీరసింహారెడ్డి తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేనితో మరోసారి జట్టు కట్టేందుకు బాలయ్య సిద్ధమవుతున్నాడు. ఈ ప్రాజెక్ట్‌లో బాలయ్య పాత్ర మరింత రఫ్ అండ్ టఫ్‌గా, పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గా ఉంటుందంటున్నారు. ఇద్దరి సినిమాలు ఒకే జానర్‌లో ఉండటమే కాకుండా 2027 సంక్రాంతికి విడుదలయ్యే అవకాశం ఉందన్న ప్రచారం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా

## పుత్రుని కోసం..

సినిమా రంగంలో వారసత్వం అనేది కొత్త కాదు. కానీ తండ్రి దర్శకుడిగా మారి కొడుకును వెండితెరకు పరిచయం చేయడం అనేది ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన సంచలనమే. 1974లో ఎన్టీఆర్ దర్శకత్వంలో వచ్చిన తాతమ్మ కల సినిమాతో బాలకృష్ణ వెండితెరకు పరిచయమయ్యాడు. అలాగే హరికృష్ణ కూడా ఎన్టీఆర్ దర్శకత్వంలోనే బాలనటుడిగా మెరిశాడు. ఇదే బాటలో మంచు మోహన్ బాబు కూడా తన కుమారుడు విష్ణును విష్ణు సినిమాతో పరిచయం చేయగా, తమిళంలో టి.రాజేందర్ తన కుమారుడు శింబును చిన్నప్పుడే దర్శకుడిగా వెండితెరకు పరిచయం చేశాడు. ప్రస్తుతం సౌత్ ఇండియన్ స్టార్ హీరో ధనుష్ తన 16 ఏళ్ల కుమారుడు యాత్ర రాజాని హీరోగా లాంచ్ చేయడానికి సిద్ధమవుతున్నారనే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ధనుష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నప్పటికీ.. మొదటగా యాత్రను లాంచ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ధనుష్ తాను ఇప్పటికే దర్శకత్వం వహించిన రాయన్, తేరే ఇష్క్ మే చిత్రాలు మంచి హిట్ అవ్వటంతో, తండ్రిగా తన కొడుకు కెరీర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యతను భుజాన వేసుకున్నాడు.



## కాటుక కండ్లతో

అనుపమ పరమేశ్వరన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తెలుగులో తన మొదటి సినిమాతోనే ప్రేక్షకుల్ని ఫిదా చేసింది ఈ మలయాళీ బ్యూటీ. . అందం, అభినయంతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బ్యాక్‌టు బ్యాక్ మూవీస్‌తో తెలుగు, తమిళం, మలయాళంలో వరుస ఆఫర్స్ కొట్టేసింది. ఇటీవలే కిష్కింధపురి, బైసన్‌సినిమాలతో బ్లాక్ బాస్టర్ హిట్స్‌దక్కించుకుంది. అయితే గత కొంతకాలం కిందట ఇండస్ట్రీకి దూరమైన ఈ భామ మళ్లీ గట్టి కమ్ బ్యాక్ ఇచ్చింది. తాజాగా అనుపమ ప్రధాన పాత్రలో నటించిన ఎమోషనల్‌థ్రిల్లర్ లాక్‌డౌన్ ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇక సినిమాల సంగతి ఎలా ఉన్నా అభిమానులతో మాత్రం ఎప్పుడూ టచ్‌లోనే ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫొటోలు పంచుకుంది. అందులో కాటుక కండ్లతో ఫ్యాన్స్‌ను మాయ చేస్తోంది. వీటికి 'ఇప్పుడు అర్థమైంది.. అంతా ఎందుకలా జరిగిందో' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. అనుపమ షేర్ చేసిన ఈ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## నా కల నెరవేరిన క్షణాలు అవి: సారా అర్జున్



ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలోనే అగ్ర దర్శకుల సినిమాల్లో నటిస్తూ విజయాలు సొంతం చేసుకుంటున్నారు నటి సారా అర్జున్. ఇటీవలే 'ధురంధర్'తో భారీ హిట్ అందుకున్న ఆమె ప్రస్తుతం 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సారా అర్జున్ తన జీవితంలోనే ఆనందకరమైన రోజు గురించి మాట్లాడారు. ''పొన్నియిన్ సెల్వన్'లో నటించిన రోజులను ఎప్పటికీ మర్చిపోలేను. మణిరత్నం దర్శకత్వంలో నటించాలని కలలు కన్నాను. 'పొన్నియిన్ సెల్వన్'తో ఆ కల నెరవేరింది. అలాగే, 'ధురంధర్' సక్సెస్ కూడా నాకెంతో ప్రత్యేకం. నా తల్లిదండ్రులు ఆ సినిమా చూసి భావోద్వేగానికి గురయ్యారు. వాళ్లు ఎమోషనల్ అవడం చూసి నాకు ఆనందబాష్పాలు వచ్చాయి'' అని చెప్పారు. తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. ''పొన్నియిన్ సెల్వన్' తర్వాత యాక్టింగ్‌ను మరింత మెరుగుపరచుకోవడం కోసం విదేశాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నా. కానీ, యుఫోరియా టీమ్ నన్ను సంప్రదించినప్పుడు ఆ కథ కచ్చితంగా ప్రస్తుత సమాజానికి అవసరం అనిపించింది. ఇలాంటి కథలో భాగమయ్యే అవకాశం కొంతమందికే వస్తుంది. అది నా అదృష్టం. నా కెరీర్ మొత్తం ఒక మ్యాజిక్‌లా ఉంది. మణిరత్నం దర్శకత్వంలో సినిమా తర్వాత 'యుఫోరియా'కు సైన్ చేయడం.. దీని షూటింగ్ జరిగే సమయంలోనే 'ధురంధర్'ను అంగీకరించడం.. అది భారీ విజయం అందుకోవడం అంతా మ్యాజిక్‌లా జరిగింది'' అని సారా వివరించారు.

## 'నారీ నారీ నడుమ మురారి' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?



సంక్రాంతి కానుకగా విడుదలై, విజయం అందుకున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'నారీ నారీ నడుమ మురారి'. ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో ఫిబ్రవరి 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీలోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని సదరు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. సంక్రాంతి బరిలోకి చివరిగా వచ్చిన (జనవరి 14న) ఈ చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇద్దరమ్మాయిల మధ్య నగిలిపోయే వ్యక్తిగా హీరో శర్వానంద్, హీరోయిన్లుగా సాక్షి వైద్య, సంయుక్త ఆకట్టుకున్నారు. సీనియర్ నటుడు నరేశ్, సత్య, సునీల్, వెన్నెల కిశోర్ తమ మార్క్ కామెడీతో అలరించారు. వినోదాత్మక కథలపై తనకెంత పట్టుందో దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాతో మరోసారి నిరూపించారు. ఈ సినిమా కథేంటంటే?: బీటెక్ చేసి ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్న కుర్రాడు గౌతమ్ (శర్వానంద్). నిత్య (సాక్షి వైద్య)తో ప్రేమలో ఉన్న తను.. ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి పీటలెక్కాలని అనుకుంటాడు. ఈ పెళ్లికి తొలుత నిత్య తండ్రి రామలింగం (సంపత్ రాజ్) అడ్డు చెప్పినా.. తర్వాత అంగీకరిస్తాడు. ఆ పెళ్లి రిజిస్టర్ ఆఫీస్‌లో జరగాలని షరతు పెడతాడు. తప్పని పరిస్థితుల్లో దీనికి గౌతమ్ ఓకే అంటాడు. అలా పెళ్లికి దరఖాస్తు చేసుకున్నాక గౌతమ్‌కు ఓ అనుకోని చిక్కు ఎదురవుతుంది. దానికి, కాలేజీలో ప్రేమించిన దియా (సంయుక్త)కు ఉన్న సంబంధం ఏంటి? అసలు వాళ్లిద్దరూ ఎందుకు విడిపోవాల్సి వచ్చింది? ఈ రెండు ప్రేమకథల వల్ల గౌతమ్ తండ్రి కార్తీక్ (నరేశ్) పిన్ని పల్లవి (సిరి హనుమంతు)ల దాంపత్య జీవితం విడాకుల దాకా ఎందుకు వెళ్లింది? అన్నది మిగతా కథ.

## సినీరంగంలో రాజకీయ జోక్యం.. ప్రకాశ్‌రాజ్ కీలక వ్యాఖ్యలు



సినీ రంగంలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని సీనియర్ నటుడు ప్రకాశ్ రాజ్ అన్నారు. 17వ బెంగళూరు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆయన చలన చిత్రోత్సవాల్లో రాజకీయ జోక్యం గురించి మాట్లాడారు. అలాగే, పాలస్తీనా సినిమాలను కూడా ఈ వేడుకల్లో ప్రదర్శించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఫెస్టివల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ప్రకాశ్‌రాజ్ పాలస్తీనా సినిమాల నిషేధంపై కర్ణాటక ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ''అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు, సాహిత్య ఉత్సవాల ఉద్దేశం విభిన్నమైన ఆలోచనలను పంచుకోవడమే. కానీ, అది గాడి తప్పుతోంది. ఇటీవల కాలంలో సినిమా, సాహిత్య రంగంలో రాజకీయ జోక్యం ఎక్కువైంది. ఈ కార్యక్రమాల్లో పాలస్తీనా సినిమాలను నిషేధించడం ఆమోదయోగ్యం కాదు. కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలి. కేరళ ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకొని ఆ సినిమాలను కూడా ప్రదర్శించింది. ఆ దిశగా కర్ణాటక ప్రభుత్వం కూడా అడుగులు వేయాలని కోరుకుంటున్నా'' అని ప్రకాశ్ రాజ్ అన్నారు. 17వ బెంగళూరు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు ఫిబ్రవరి 6 వరకు కొనసాగనున్నాయి. ఈ వేడుక ప్రారంభ కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. సమాజ ఉన్నతిని కాంక్షించి చిత్రాలు తీసేవారికి, కర్ణాటక చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలిపారు.

## ఓటీటీలోకి 'ది రాజాసాబ్'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు సంస్థ అధికారిక ప్రకటన చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.